క్లుప్తంగా

వృద్ధురాలి అదృశ్యం



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ద్యాంగ ల్లీకి చెందిన గాండ్ల లక్ష్మి (60) అనే వృద్ధురాలు అదృశ్యమైనట్లు పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు. వివరాలు.. లక్ష్మి ఈ నెల 23న ఇంటి నుంచి బయటకు వెళ్లి ఇప్పటి వరకు తిరిగి రాలేదని, బంధువుల వద్ద ఆరా తీసినా ఆచూకీ లభించలేదని పోలీసులు తెలిపారు. లక్ష్మి కుమారుడు సాయి కుమార్ మంగళవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 8712659870, 8712659778 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

తాగి వాహనం నడిపినందుకు జైలు శిక్ష

నవీపేట: మద్యం తాగి వాహనాన్ని నడిపినందుకు మండల కేంద్రానికి చెందిన ఆసది విజయ్‌కుమార్‌కు రెండు రోజుల జైలు శిక్ష పడినట్లు ఎస్సై వినయ్ మంగళవారం తెలిపారు. రెండు రోజుల కిందట నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఆసది విజయ్‌కుమార్‌పై కేసు నమోదు చేశామన్నారు. కోర్టులో హాజరుపరుచగా స్పెషల్ జ్యూడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ బేగం శిక్ష విధించినట్లు పేర్కొన్నారు. మరో నలుగురికి రూ.2 వేల చొప్పున జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

సాటాపూర్ సంత @ రూ.9.43 లక్షలు

రెంజల్(బోధన్): సాటాపూర్ సంతకు మంగళవారం పంచాయతీ కార్యాలయంలో బహిరంగ వేలం పాట నిర్వహించారు. నీలా గ్రామానికి చెందిన వ్యాపారి రూ. 9. 43 లక్షలకు దక్కించుకున్నారు. రెంజల్, కల్యాపూర్ గ్రామాల్లో వార సంతలు ప్రారంభం కావడంతో గత సంవత్సరం కంటే రూ.15 వేలు తగ్గించి వేలం పాటను దక్కించుకున్నారు.

మేకల సంతకు రూ.6.55లక్షలు

రుద్రూర్: పోతంగల్ మండల కేంద్రంలో తైబజార్, మేకల సంతకు మంగళవారం వేలం పాట నిర్వహించారు. మేకల సంతను ఎల్లారెడ్డికి చెందిన హుస్సేన్ రూ. 6.55 లక్షలకు దక్కించుకున్నారు. వారాంతపు సంతకు నిర్ణయించిన ధర రానందున గురువారం నాటికి వాయిదా వేశారు. కోటగిరి గ్రామ పంచాయతీలో వారాంతపు సంతను రూ.4లక్షల 58 వేలకు పోతంగల్ గ్రామానికి చెందిన గంగారాం దక్కించుకున్నారు.

ఆర్మూర్ తైబజార్ వేలం పాట వాయిదా

ఆర్మూర్‌టౌన్: ప్రభుత్వం నిర్ణయించిన ధర రాకపోవడంతో తైబజార్ వేలం పాట వాయిదా వేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాజు తెలిపారు. ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం తైబజార్ వేలం పాట నిర్వహించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ. 29.63, 730 ఉండగా వేలం పాల్గొన్న ఇద్దరు కూడా ముందుకు రాలేదు. దీంతో వేలం పాట వాయిదా వేసి తిరిగి బుధవారం ఉదయం 11గంటల నిర్వహించనున్నట్లు కమిషనర్ పేర్కొన్నారు.

ఆర్థిక సహాయం



రుద్రూర్: పోతంగల్ మండలం జల్లాపల్లి ఫారం, కల్లూర్ గ్రామాల్లోని బాధిత కుటుంబాలకు మంగళవారం ఆర్థిక సహాయాన్ని సామాజిక సేవకుడు ఏంఏ హకీమ్ అందజేశారు. జల్లాపల్లి ఫారానికి చెందిన రషీద్, జల్లాపల్లి అబాదికి చెందిన అబ్దుల్ రవుఫ్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుండడంతో వారికి ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పన అందజేశారు. కల్లూర్ గ్రామంలో సోమవారం అగ్ని ప్రమాదం సంభవించి కట్టుబట్టలతో మిగిలిన బీర్కూర్ గంగారం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. జల్లాపల్లిలో పేద ముస్లింలకు రంజాన్ మాసం పురస్కారించుకుని దుస్తులు పంపిణీ చేశారు.

ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాలి

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణ వ్యాపార సముదాయాల యజమానులు మార్చి 31 లోపు తమ ట్రేడ్ లైసెన్స్‌లను ఎలాంటి అపరాధ రుసుము లేకుండా రెన్యువల్ చేసుకోవచ్చని మున్సిపల్ కమిషనర్ రాజు తెలిపారు. ఏప్రిల్ 1, 2025 నుంచి జూన్ 30, 2025 వరకు రెన్యువల్ చేసుకునే వారికి 25 శాతం పెనాల్టీ ఉంటుందని, జూలై 1 తర్వాత రెన్యువల్ చేసుకునే వారికి 50 శాతం పెనాల్టీ పడుతుందన్నారు.

కాలువ సరిహద్దుల సర్వే

పెర్కిట్: కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్మూర్ మున్సిప ల్ పరిధిలోని పెర్కిట్‌లో ఆర్డీవో రాజాగౌడ్ ఆధ్వర్యంలో ల్యాండ్ సర్వే విభాగం, ఇరిగేషన్ శాఖల అధికారులు మంగళవారం సంయుక్తంగా సర్వే నిర్వహించారు. సర్వేలో ఇరిగేషన్ స్థలం ఆక్రమణకు గురైనట్లు అధికారులు గుర్తించారు. సర్వే నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపనున్నారు. జిల్లా సర్వే, ల్యాండ్ రికార్డ్స్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ అశోక్, ఇరిగేషన్ డీఈ కృష్ణమూర్తి, ఈఈ రామారావు, తహసీల్దార్ సత్యనారాయణ ఉన్నారు.

ప్రమాదపు అంచున ప్రయాణం

- బోధన్- సాలూర బైపాస్ రోడ్డు అంచులో భారీ గుంతలు
- కనీసం ప్రమాద సూచిక బోర్డులు పెట్టాలని కోరుతున్న స్థానికులు



సాలూర క్యాంప్ వద్ద పొలాల్లోకి పోయిన ఆటో



సాలూర శివారులో గుంతలో దూసుకుపోయి కరెంట్ స్తంభానికి ఢీకొన్న డీసీఎం వ్యాన్

బోధన్: బోధన్ పట్టణ కేంద్రం నుంచి పొరుగున ఉన్న మహారాష్ట్రకు వెళ్లే అంతర్రాష్ట్ర రోడ్డు మీద ప్రయాణం ప్రమాదపుటంచున సాగుతోంది. ఈ రోడ్డు మీదుగా నిత్యం వందల సంఖ్యలో వాహనాల వెళ్తుంటాయి. రోడ్డు వెంబడి ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాల వద్ద సూచిక బోర్డులు పెట్టకపోవడంతో ఈ నడుమ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మూడు రోజుల క్రితం డీసీఎం వ్యాన్ సాలూర శివారులోని బైపాస్ రోడ్డు పక్కన ఉన్న భారీ గుంతల్లోకి దూసుకుపోయి హైలెవల్ కరెంట్ స్తంభానికి ఢీకొట్టింది. వ్యాన్ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సాలూర క్యాంప్-సాలంపాడ్ క్యాంప్ క్రాసింగ్ వద్ద ప్యాసింజర్ ఆటో పంట పొలాల్లోకి దొచ్చుకుపోయింది. ఆటోలో ప్రయాణికులు లేకపోవడంతో ప్రాణ నష్టం జరుగలేదు. ఇలా రెండు మూడు రోజులకొకసారి వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి.

పలుచోట్ల భారీ గుంతలు..

బోధన్, సాలూర మండలాల పరిధిలోని నాగన్‌పల్లి, సాలూర క్యాంప్, సాలూర గ్రామాల శివారులో పంట పొలాల మధ్య 4 కిలో మీటర్ల మేర బైపాస్ రోడ్డు నిర్మించారు. ఈ బైపాస్ రోడ్డులో మూడు గ్రామాల క్రాసింగ్‌ల వద్ద, పంట కాలువల వద్ద నిర్మించిన కల్వర్టుల వద్ద ఇరువైపులా భారీ గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. రాత్రి వేళల్లో బైపాస్ రోడ్డు అంచున ఉన్న భారీ గుంతలు కనిపించక వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. మూలమలుపుల వద్ద కనీసం ప్రమాద సూచిక బోర్డులైనా పెట్టాలని స్థానిక గ్రామాల ప్రజలు ,వాహనదారులు కోరుతున్నాయి. అంతర్రాష్ట్ర రోడ్డు నిర్వహణను నేషనల్ హైవే అథారిటీ పర్యవేక్షిస్తోంది.

అధికారులు చర్యలు తీసుకోవాలి



మా గ్రామ బైపాస్ రోడ్డు మార్గంలో పలు చోట్ల భారీ గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా ఉన్నాయి. అధికారులు వెంటనే చర్యలు తీసుకుని మూల మలుపులు, భారీ గుంతల వద్ద ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

– రత్నెల్లి లింగయ్య, రైతు సాలూర గ్రామం

పొంచి ఉన్న ప్రమాదం



గాలిబ్‌నగర్ నుంచి కల్లెడి వెళ్లే మార్గంలో ఉన్న ప్రమాదకర మలుపు



మూలమలుపు వద్ద ఏర్పడిన పెద్ద గుంత

మాక్లూర్: అసలే ప్రమాదకరమైన మలుపు.. మలుపు వద్దే పెద్ద గోతి. వాహనదారుడు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రాణాలు గాల్లో కలిసిపోవాల్సిందే. మండలంలోని గాలిబ్‌నగర్ నుంచి కల్లెడికి వెళ్లే మార్గంలో మూల మలుపు వద్ద గడిచిన ఆరు నెలలుగా చాలా వాహనాలు ప్రమాదాలకు గురయ్యాయి. పలువురు తీవ్ర గాయాలపాలైనట్లు స్థానికులు చెబుతున్నారు. అధికారులు మాత్రం ప్రమాదకరమైన మలుపు అంటూ రోడ్డుకు రెండు వైపుల హెచ్చరిక బోర్డులు పెట్టి చేతులు దులుపుకున్నారు..కానీ గుంతను పూడ్చటానికి మాత్రం పూనుకోలేదని స్థానికులు వాపోతున్నారు.

అధికారులు స్పందించాలి

ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి వెంటనే ప్రమాదకరమైన మూల మలుపు వద్ద ఏర్పడిన గుంతను పూడ్చివేయాలి. ఇప్పటికే ఇక్కడ చాలా రోడ్డు ప్రమాదాలు జరిగాయి. – తలారి శ్రీకాంత్, వాహనదారుడు, కల్లెడి

మొరం పోయిస్తాం

గాలిబ్‌నగర్ నుంచి కల్లెడి వెళ్లే బీటీ రోడ్డు మూల మలుపు వద్ద భారీ గుంత ఏర్పడింది నిజమే. వెంటనే గుంతను మొరంతో పూడ్చివేయిస్తాను. వర్షాకాలంలో వర్షపు నీరుతో పాటు కాలువ నీరు అక్కడి నుంచే ప్రవహించడం వల్ల భారీ గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది.

– గులాబ్‌సింగ్, ఆర్అండ్‌బీ ఏఈ, మాక్లూర్

విద్యుత్ అధికారుల పొలంబాట



అవగాహన కల్పిస్తున్న విద్యుత్ అధికారులు

కమ్మర్‌పల్లి: బషీరాబాద్‌లో మంగళవారం విద్యుత్ శాఖాధికారులు పొలంబాట పట్టారు. విద్యుత్ సమస్యలు, పరిష్కారాలు, వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఫిర్యాదు చేస్తే సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తామని తెలియజేశారు. డీఈ ఆల్జాపూర్ శ్రీనివాస్, హెచ్‌టీ, ఎల్‌టీ, సీజీఆర్‌ఎఫ్ 2 అధికారులు, ఏఈ శ్రీకృష్ణకాంత్, లైన్‌మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

రైతు భరోసా అందరికీ ఇవ్వాలి



మహాజన సభకు హాజరైన చైర్మన్, ఇతర నేతలు

మోర్తాడ్: పంటల సాగుకు పెట్టుబడి సాయాన్ని 5 ఎకరాల కంటే ఎక్కువ భూమి ఉన్న రైతులకు కూడా అందించాలని మోర్తాడ్ సహకార సంఘం మహాజన సభలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. మంగళవారం చైర్మన్ బద్దం అశోక్‌రెడ్డి అధ్యక్షతన మహాజన సభ సమావేశం నిర్వహించారు. వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో అమ్మిన రైతులకు రూ.500ల చొప్పున బోనస్ అందించాలని కోరారు. వైస్ చైర్మన్ దడివె నవీన్, డీసీసీబీ డైరెక్టర్ మోత్కు భూమన్న, డైరెక్టర్లు ఎలాల భూమారెడ్డి, నాయకపు సాయన్న, ముత్యాల లక్ష్మన్, కుంట అశోక్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు బూత్‌పురం మహిపాల్, నవీద్, సీఈవో కాశీరాం పాల్గొన్నారు.

విలీన సభను విజయవంతం చేయాలి



విలీన సభ వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

బోధన్: తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్, ఆదర్శ మున్సిపల్ యూనియన్‌ల విలీన సభను ఈ నెల 27న డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ఘన్‌పూర్ వీడీసీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్నారు. సభకు సంబంధించిన వాల్ పోస్టర్లను మంగళవారం పట్టణ కేంద్రంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి దాల్‌మల్క పోశెట్టి.. కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలీన సభకు కార్మికులు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్మికులు నాగవ్వ, రాణి, శంకరమ్మ, శోభ, తదితరులు పాల్గొన్నారు.


బయటపడ్డ సీతారాముల విగ్రహం



విగ్రహానికి పూజలు చేస్తున్న గ్రామస్తులు

మాక్లూర్: మండలంలోని కల్లెడి గ్రామంలోగల సబ్ స్టేషన్ పరిసరాల్లో మంగళవారం సీతారాముల విగ్రహం బయటపడటంతో గ్రామస్తులు అక్కడే ఉన్న మర్రిచెట్టు వద్ద నెలకొల్పి పూజలు చేశారు. గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు చెట్టు కింద పరిసరాలను శుభ్రం చేస్తుండగా అక్కడ సీతారాముడు, లక్ష్మణుడు ఉన్న రాతి విగ్రహం బయటపడింది. ఈ విషయం గ్రామంలో తెలియడంతో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో విగ్రహం వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అమ్దాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ సందర్శన



రికార్డులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ వికాస్

బోధన్‌రూరల్: అమ్దాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌ను బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో మంగళవారం సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి విద్యా బోధన, సౌకర్యాలపై ఆరా తీశారు. చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఉపాధ్యాయులకు సూచించారు. హెచ్‌ఎం సూర్యకుమార్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్మూర్ ఆస్పత్రి సందర్శన



సేవల గురించి తెలుసుకుంటున్న వైద్యుడు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ఏరియా ఆస్పత్రిని మంగళవారం బిచ్కుంద ఆస్పత్రి వైద్యుడు కాళిదాస్, వైద్య సిబ్బంది కాయకల్ప కార్యక్రమంలో భాగంగా సందర్శించారు. ఈసందర్భంగా ఆస్పత్రిలో అందిస్తున్న సేవలు, సదుపాయాల గురించి ఆస్పత్రి సూపరింటెండెంట్ రవికుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు అమృత్‌రాంరెడ్డి, అజయ్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తం

నేడు మార్కెట్‌యార్డులో ఇఫ్తార్ విందు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని మార్కెట్ యార్డులో బుధవారం ప్రభుత్వం అధికారికంగా ఇఫ్తార్ విందు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్, మర్కజ్ కమిటీ అధ్యక్షుడు మొయినుద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, మర్కజ్ కమిటీ సభ్యులు మార్కెట్ యార్డులో స్థలాన్ని పరిశీలించారు. ఆర్మూర్, ఆలూరు మండల మైనార్టీలకు ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశామని వారు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు ఇంతియాజ్, అతిక్, చిట్టి, భూపేందర్, ఫయాజ్ పాల్గొన్నారు.

మాక్లూర్‌లో మైనార్టీలకు హిందువుల ఇఫ్తార్ విందు

మాక్లూర్: రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని మంగళవారం రాత్రి మండల కేంద్రంలోని మైనార్టీ యువకులకు, హిందూ యువకులు ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమంలో షేక్ కమ్రుద్దీన్, తాజుద్దీన్, రోఫాత్‌ఖాన్, భూషణ్, నరసయ్య, వెంకటరమణ, సాయిప్రదీప్, నరేష్, విష్ణుగౌడ్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

నవీపేట: నాళేశ్వర్ గ్రామానికి చెందిన బుర్ర రాములుకు బినోల సొసైటీ చైర్మన్ మగ్గారి హన్మాండ్లు మంగళవారం సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఎమ్మెల్సీ కవిత చొరవతో మంజూరైన చెక్కును దరఖాస్తుదారుడికి అందజేసినట్లు పేర్కొన్నారు.


చలివేంద్రం ప్రారంభం

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం గోవింద్‌పేట్‌లో మంగళవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. జీపీ కార్యదర్శి సుకన్య, సిబ్బంది మనోజ్, కౌశిక్, మురళి, సాయి కుమార్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండలం దేగాంలో వైకుంఠధామానికి వెళ్లే మార్గంలో మంగళవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి నిధులు మంజూరు చేయించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, ఎంపీ అర్వింద్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలి



రెంజల్(బోధన్): ప్రాథమిక స్థాయి నుండి విద్యార్థులు క్రమశిక్షణ అలవర్చుకోవాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ సూచించారు. మంగళవారం నీలా హైస్కూల్‌ను ఆయన సందర్శించారు. పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు రూరల్ సీఐ విజయ్‌బాబును ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. హెచ్‌ఎం శంకర్, ఉపాధ్యాయులు ఆనంద్, ప్రవీణ్, ఖాజా, తదితరులు పాల్గొన్నారు.

రాములోరి కల్యాణ తలంబ్రాల కరపత్రాల ఆవిష్కరణ



బోధన్: భద్రాచలం సీతారాములోరి కల్యాణ తలంబ్రాల సరఫరాకు సంబంధించిన స్టిక్కర్లు, కరపత్రాలను మంగళవారం పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో డీఎం విశ్వనాథ్, కార్గో సర్వీసు ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల ఇన్‌చార్జి పాల్ ఆవిష్కరించారు. రూ.151 చెల్లిస్తే భక్తులకు ఇంటి వద్దకు వెళ్లి అందిస్తామని వారు తెలిపారు. స్థానిక కార్గో లాజిస్టిక్ డీఎంఈ వీకే కిషోర్, డిపో అధికారులు పాల్గొన్నారు.

వేల్పూర్‌లో ఉపాధిహామీ ప్రజావేదిక

వేల్పూర్: వేల్పూర్ మండల పరిషత్ ఆవరణలో మంగళవారం జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సాయాగౌడ్, విజిలెన్స్ ఆఫీసర్ నారాయణ ఆధ్వర్యంలో ఉపాధిహామీ ప్రజావేదిక నిర్వహించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో 16వ విడత ఉపాధిహామీ కింద జరిగిన పనులకు సంబంధించి జరిగిన రూ.3.50 కోట్ల చెల్లింపులపై సామాజిక తనిఖీ చేశారు. గ్రామాలలో చేపట్టిన ఉపాధిహామీ పనులపై అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీడీవో బాల కిషన్, ఎస్ఆర్‌పీ సుశీల, ఈజీఎస్ ఏపీవో అశోక్, తదితరులు పాల్గొన్నారు.

యువత చెడు వ్యసనాలకు బానిస కావొద్దు



నీలాలో శోభాయాత్ర చేస్తున్న హన్మాన్ స్వాములు

రెంజల్(బోధన్): యువత చెడు వ్యసనాలకు బానిసకావద్దని మల్లారం లింగేశ్వర గుట్ట ఆశ్రమం వ్యవస్థాపకుడు పిట్ల కృష్ణ మహరాజ్ సూచించారు. నీలా గ్రామంలో మంగళవారం హన్మాన్ స్వాములకు మండల భిక్షను ఏర్పాటు చేశారు. ముందుగా గ్రామంలోని హన్మాన్ మందిరం నుంచి చౌరస్తా వరకు శోభాయాత్ర నిర్వహించారు. కందకుర్తి ఆశ్రమ పీఠాధిపతి సీతారాం త్యాగి మహరాజ్‌తో కలిసి హిందూవాహిని ఆధ్వర్యంలో కాషాయ జెండాను ఆవిష్కరించారు.

జాన్కంపేటలో శోభాయాత్ర

ఎడపల్లి(బోధన్): జాన్కంపేటలో హనుమాన్ శోభాయాత్రను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆంజనేయ స్వామి విగ్రహాన్ని రథంపై ఉంచి పెద్ద హనుమాన్ మందిర్ నుంచి గ్రామంలోని పురవీధుల గుండా శోభాయాత్ర చేశారు. అనంతరం అన్నదానం చేపట్టారు. ఆంజనేయ స్వామి మాలధారణ భక్తులకు జెండా గల్లీ గణేష్ మండలి యూత్ ఆధ్వర్యంలో మంచినీటి సౌకర్యం, పండ్ల పంపిణీ చేశారు.

ఇచ్చిన హామీల అమలు ఎక్కడ?



ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు సిద్ధమైన సీఐటీయూ నాయకులు, ఆశావర్కర్లు

బోధన్: అధికారంలోకి రాగానే ఆశావర్కర్లకు నెలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం చెల్లిస్తామని ఇచ్చిన హామీ అమలు ఏమైందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జె.శంకర్ గౌడ్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వం కాలయాపన చేస్తున్న నేపథ్యంలో రాష్ట్ర కమిషనర్ ఆఫీస్‌కు వెళ్లేందుకు బయలుదేరిన ఆశావర్కర్లను అరెస్టు చేశారని పేర్కొన్నారు. అరెస్టుకు నిరసనగా మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో సీఐటీయూ నాయకులు, ఆశావర్కర్లు రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేసే ప్రయత్నంలో ఉండగా, గమనించిన పోలీసులు దిష్టిబొమ్మను వారి వద్ద నుంచి గుంజుకున్నారు.

వర్ని: ఆశా కార్యకర్తలపై లాఠీచార్జి చేయించి అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం మోస్రా మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా ఉద్యోగుల పట్ల చిన్నచూపు చూస్తున్నాయని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్ ఆరోపించారు. తక్షణమే శాసనసభలో చర్చించి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నాయకులు విజయ, రాణి, భాగ్యలక్ష్మి, గంగా, సరోజ, లక్ష్మి, రూప, ఉమా, శ్యామల, స్రవంతి, సాత్విక పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపోడుకోడానికే సంవిధాన్



మాక్లూర్‌లో మాట్లాడుతున్న వినయ్‌రెడ్డి

మాక్లూర్: ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవటానికే నియోజకవర్గంలో సంవిధాన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పొద్దుటూరి వినయ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రఫత్‌ఖాన్ గార్డెన్‌లో మండల పార్టీ అధ్యక్షుడు రవి ప్రకాష్ ఆధ్వర్యంలో జరిగిన సంవిధాన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. స్వాతంత్ర్య సమరయోధులను, రాజ్యాంగాన్ని అవమానిస్తుందని విమర్శించారు. వారి వ్యవహారశైలిని అలాగే వదిలేస్తే ప్రజాస్వామ్య మనుగడకే ప్రమాదం అన్నారు. కాంగ్రెస్ నాయకులు పంచరెడ్డి చరణ్, మార చంద్రమోహన్, రమేష్‌రెడ్డి, చంద్రునాయక్, దేగ పోశెట్టి, గంగాధర్‌గౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

తైబజార్ వేలంలో 'సిండికేట్'

- ఏటా ఇదే తంతు..
- జీపీ ఆదాయానికి గండి
- బాల్కొండ జీపీలో పరిస్థితి

బాల్కొండ: మండల కేంద్రంలో ప్రతి గురువారం నిర్వహించే సంత కోసం ప్రతి ఆర్థిక సంవత్సరం తైబజార్ వేలం నిర్వహిస్తారు. ఈ ఏడాది మొదటి సారి వేలం నిర్వహించగా.. అందరూ సిండికేట్‌గా ఏర్పడి జీపీకి రావాల్సిన ఆదాయం రాకుండా గండి కొట్టాలని ప్రయత్నించారు. దీంతో తైబజార్ వేలాన్ని అధికారులు వాయిదా వేశారు. మండల కేంద్రంలో ప్రతి గురువారం నిర్వహించే వారం సంతకు వేలం ధర ప్రభుత్వం రూ.5 లక్షల 57 వేలుగా నిర్ణయించింది. కాని మొదటి సారి వేలంలో వారం సంతకు రూ.3 లక్షల 41 వేలు మాత్రమే పాడారు. రోజువారీ మార్కెట్‌కు ఒక్కరే డిపాజిట్ చెల్లించారు. దీని వెనుక సిండికేట్ వ్యవహారం ఉండటంతో ఒక్కరే డిపాజిట్ వేశారు. ఇలా ప్రతి సంవత్సరం జరుగుతుంది. దీంతో అధికారులు మూడు సార్లు వేలం నిర్వహిస్తారు. సోమవారం రెండోసారి వేలం నిర్వహించారు. ఈ వేలంలో రోజువారి సంతను రూ.51,200లకు స్థానికుడు దక్కించుకున్నారు. మంగళవారం వారసంతకు మూడోసారి వేలం నిర్వహించగా రూ.3. 51 లక్షలకు పాడారు. వేలంలో సరైన ధర రాకపోవడంతో ఈ విషయం గురించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని అధికారులు చెబుతున్నారు. ప్రతి సంవత్సరం 5 శాతం పెంచుతూ ప్రభుత్వం తైబజార్ వేలం నిర్వహిస్తుంది. కాని ఇక్కడ సిండికేట్ వల్ల అంత నగదు రాకుండా పోతుంది. రెండేళ్ల క్రితం తైబజార్ వేలం వేయకుండానే వదిలేశారు. సిండికేట్ కథకు ముగింపు పలికితే జీపీకి రావాల్సినంతా రాబడి వస్తుంది. అధికారులు సైతం తమ వాటాల కోసం సిండికేట్ వైపే మొగ్గు చూపుతారనే విమర్శలున్నాయి. జీపీ ఆదాయానికి గండి పడకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. గత సంవత్సరం రూ.4 లక్షల వేయికి వారం సంత తైబజార్ దక్కించుకున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం

తైబజార్ వేలం ఇప్పటికే మూడు సార్లు నిర్వహించినా ప్రభుత్వం నిర్ణయించిన ధర రాలేదు. ఈ విషయం గురించి ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

– రజనీకాంత్‌రెడ్డి, కార్యదర్శి, బాల్కొండ

సీసీ కెమెరాలతో నేరస్తులను తేలికగా గుర్తించొచ్చు

రుద్రూర్: వ్యాపారులు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై సాయన్న సూచించారు. రుద్రూర్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఎస్సై మాట్లాడారు. సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేర నియంత్రణ చేయవచ్చన్నారు. ఏదైనా ఘటనలు జరిగితే నేరస్తులను తేలికగా గుర్తు పట్టవచ్చన్నారు. నేరాల నియంత్రణ, కేసుల చేదనలో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. హెడ్ కానిస్టేబుల్ అంజాద్ పాల్గొన్నారు.

జమిలితోనే దేశానికి భవిష్యత్

నవీపేట/ఎడపల్లి(బోధన్): జమిలి ఎన్నికలకు బీజేపీ సిద్ధంగానే ఉందని పార్టీ జిల్లా నాయకులు డాక్టర్ కొండ ఆశన్న అన్నారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్ అనే నినాదంతో బీజేపీ ముందుకు వెళుతుందన్నారు. మంగళవారం నవీపేట, ఎడపల్లి మండలాలలో బీజేపీ కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. జమిలి ఎన్నికలతో దేశ భవిష్యత్ బాగుంటుందని అన్నారు. 1952లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం జమిలి ఎన్నికలు నిర్వహించిందని గుర్తు చేశారు. నాయకులు మల్లెపూల శ్రీనివాస్, కందకట్ల రామ చందర్, గంగాధర్, లక్ష్మణ్ గౌడ్, రామ్‌రెడ్డి, చింత వేణు, రాజు, సాయి రెడ్డి పాల్గొన్నారు

సినిమాలు

పీవీఆర్ మల్టీప్లెక్స్ (ఆర్మూర్)

స్క్రీన్-1 ఓ అందాల రాక్షసి 11.00, కిస్ కిస్ కిస్సిక్ 1.45, 7.35, ఆర్టిస్ట్ 4.35, 10.25

స్క్రీన్-2 ఛావా10.00, 4.00, 10.00 షణ్ముఖ 1.20, 7.20

స్క్రీన్-3 సలార్-పార్ట్-1 10.00, 4.05, 10.10 పెళ్లికాని ప్రసాద్ 1.30, 7.35

స్క్రీన్-4 కోర్ట్ 10.00, 1.05, 4.10, 7.15, 10.20

మాంసం ధరలు(రూ..)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్స్‌డ్	140
		లైవ్	90
స్కిన్‌లెస్	160	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	90,500	వెండి(కిలో)	1,03,000
22 క్యారెట్స్	83,527		

– నిజామాబాద్ బిజినెస్